రిక్షా ప్రయాణం

"అమ్మా రిక్సా కావాలా"

తైల సంస్కారంలేని ఉంగరాల జుట్టు, కోల ముఖంలో చురుకైన కళ్లు, సూది ముక్కు, బండ పెదవులు, మెడలో మురికిపట్టిన తాడు, దానికి వేలాడుతూ ఏడుకొండలవాడి ప్లాస్టిక్ బిళ్ళ, చిన్నచిన్న బొక్కల బనీను, రెండు పెద్ద పేచ్‌లున్న బిగుతు ఆఫ్ ఫేంటు, బనీన్ని ఫేంటుని కలుపుతూ మురికిపట్టిన నల్లని తోలుబెలు, నల్లని ఒళ్ళు. చెప్పులులేని కాళ్ళు. ముప్ఫయిమూడేళ్ళ వయసు. పేరు నర్సిమ్మ. నరిసిగాడంటారు అంతా.

"రిక్సా తల్లీ రిక్సా"

గోదావరి ఎక్స్‌ప్రెస్ చాలా ఆలస్యంగా వచ్చింది. అందులో ఆశ్చర్యంలేదు. అదేం అద్భుతంకాదు. ఎప్పుడూవున్న న్యూసెన్సే గాబట్టి పెద్ద బాధాకరమైన విషయం కూడా కాదు. ఆ మాట కొస్తే సీటూ బెర్తు రిజర్వేషనూ....వీటికన్నా ఇదిగో ఈ వూళ్ళో స్టేషన్నించి ఇంటికి వెళ్ళడమే అసలైన బాధ. సిసలైనగాథ!

"రిక్సా కావాలేటమ్మా"

ప్లాటుఫారం అవతల వుండాల్సిన రిక్షావాడు ప్లాటుఫారం టికెట్ లేనే లేకుండా ప్లాటుఫారం మీదికి ప్రవేశించి - బిలబిలమంటూ రైలు దిగిన జనాన్ని దేవేస్తున్నాడు - పట్టే యత్నంలో. పోటీలో రెండూ, మూడు చిక్కినట్టుచిక్కి చేజారిపోయేయి. నిరాశ ఆక్షణం! ఆ మరుక్షణం మళ్ళీ ప్రయత్నం. పరుగు పట్టు.

"అమ్మా రిక్సా"

అమ్మని వదిలేలాలేదు రిక్షా నరిసిగాడు.

ఆయమ్మ 'అమ్మ' అంటే అమ్మ కాదు. అమ్మమ్మ నరిసిగాడికి కాదు. ఆమె వెంట పట్టుకొని నడుస్తున్న చిన్నారి చిట్టికి. ఏడేళ్ళ బూరి బుగ్గల పెద్దకళ్ళ చిట్టికి.

చిట్టి అమ్మమ్మని పట్టుకు నడుస్తుంటే, అమ్మమ్మ ట్రంకుపెట్టిని పట్టుకు నడుస్తోంది.

పెట్టెని మోస్తుంటే చేయి లాగేస్తోంది. ఆమెకి. పదడుగులు నడిచింది. పెట్టె నేల దించింది. పెట్టెని కుడిచేతి నుంచి ఎడమచేతికీ, చిట్టిని ఎడమ చేతినుండి కుడిచేతికి మార్చుకు నడుస్తోంది. మనిషిని చూస్తే – అలాంటి బరువు పెట్టెలు పది ఒక్కసారే మోసేయగలదు అనిపిస్తుంది. కాని ఆమె తన వొళ్ళు తనే మోయలేకపోతోంది. ఆమె శరీరం యినప రాయిలా గట్టివొళ్ళు కాదు. గాలి నింపిన బెలూన్‌లా నీరు పట్టిన వొళ్ళు. నాలుగడుగులు నడిస్తేచాలు కాళ్ళు పొంగుతాయి. ఆమె వయసు యాభై అయిదేళ్ళు. పేరు సోములమ్మ. కాని అంతా దిబ్బమ్మ అంటారు.

"ఎక్కడికమ్మా ఎల్లాల"

వెళ్ళాల్సిన చోటు ఇక్కడా, అక్కడాలేదు. చాలా దూరం. ఆటో అయితే పదో, పన్నెండో అడిగే దూరం. బస్సయితే రూపాయి తీసుకొని [illegible] పైసలు తిరిగిచ్చే దూరం.

తను వెళ్ళాల్సిన సిటీబస్సు దొరికే బస్టాండు దిబ్బమ్మకి తెల్సు. [illegible] అంచునుంచి చూస్తే అదిగో, అల్లదిగో కనిపిస్తోంది.... [illegible] నడిస్తే అయిదు నిమిషాలు.

ఆమె నడిచేయగలదు-కాళ్ళు పొంగినా [illegible] చేయకుంటా. ఈ [illegible] ఆ [illegible] లేకుంటే నడిచేయును.

తను వెళ్ళాల్సిన బస్టాండు చెప్పి, చూపించి 'ఎంతిమ్మంటావు' అనడిగింది.

"రెండు రూపాయిలిప్పించండి"

[illegible] అడిగే రేట్లు చూస్తే సింహాచలం [illegible] అయినా నడిచిపోవాలనిపిస్తుంది. అది అనిపించడంవరకే! నసిగో, గుణిసో, ముక్కో, మూలిగో వాహనం ఎక్కకుండా వెళ్ళలేం మనం చివరికి. ఈ

నాగరికత ఎలాంటి దూరాన్నయినా నడిచిపోగలమనే సంగతి మనం మర్చిపోయేట్లు చేసింది. మన పూర్వీకులు కాశీకి నడిచి వెళ్లారంటే తెల్లమొగాలు వేయడం వేరే సంగతి. పెదవాల్తేరు నుంచి పూర్ణా మార్కెట్‌కి ఏమీ కాకుండా నడిచేసినవాళ్ళు - సిటీబస్సు కోసం గంటల కొలదీ వెయిట్ చేసి, నలిగిపోతూ, వేలాడ్డానికే ఇష్టపడుతున్నారిపుడు. కాలం !

"ఏటీ రెండడుగుల దూరానికి రెండు రూపాయలా ! అవ్వ ! ఏం ఆశరా"

"అదేటి తల్లీ అలాగంటారు. రెండు రూపాయలిక్క- శేరు నూకలు రాడంలేదు."

ఆమె అన్నది వేరు. వాడు చెప్పింది వేరు. కాని రెంటికీ లింకు వుండనేది వాస్తవం.

అంచేత రిక్షావాడి రేటుబట్టి ఆ పట్నం కాస్ట్ ఆఫ్ లివింగ్ ఏ స్థాయిలో వుందో ఈజీగా చెప్పేయవచ్చంటారు. ఒకే దూరానికి రిక్షావాడు రాజమండ్రిలో అర్ధరూపాయికి కడ్తాడు. విజయవాడలో ముప్పావలాకి కడ్తాడు. వైజాగులో అర్ధలూ, పావలాలు నైజాన్లా ! మూడు రూపాయలవుద్ది. ఇష్టమైతేరా, కష్టమైతే పో అంటాడు.

రెండు రూపాయలివ్వడం దిబ్బమ్మకి తన జరుగుబాటుబట్టి పెద్ద కష్టమేంకాదు. కాని కనిపించే ఆ మాత్రం దూరానికే రెండు రూపాయలు అర్పించాలంటే యెవరి మనసైనా ఎలా ఒప్పుతుంది ?

దిబ్బతనం "సుఖంగా, హాయిగా కష్టబడకుండా బతికేస్తున్నాడు" అనే దానికి సాక్ష్యం, సంకేతం. కాని దిబ్బమ్మ కష్టజీవి ఆమె కష్టపడి సంపాదించడాన్నే నమ్ముతుంది. ప్రేమిస్తుంది. ఇష్టపడుతుంది. కోరుకుంటుంది. ఏడేళ్ళ కిందట జబ్బుపడి ఒళ్ళు వచ్చింది గాని- అంతకు ముందు రివటలా లేకపోయినా లావు మాత్రం కాదు.

తను కష్టం చేసి తను బతగ్గలిగింది. పిల్లా, పాపని పెంచగల్గింది. కాని ఒక్క- పైసా కూడా కూడబెట్టలేకపోయింది. తన శ్రమంతా ఏ గంగలో కలిసిపోయి ఎవరి పూలతోటలు పెంచిందో, ఇంకెవరి పళ్ళ తోటలు పెద్ద చేసిందో ఆమెకి తెలీదు. దగాలు, దోపిడీలు.... వీటి అర్థాలు

చదివి ఇప్పటికీ సరిగా తెలీవు. తను చేసే పని – కూలిపని. ఎంతో నిక్క చ్చిగా. నిజాయితీగా చేసేది. వూరికే గోళ్ళు గిల్లుకుంటూ వుండడం ఇష్టం వుండేది కాదు. రొడ్డుమీద పేడని కూడా వూరికే పోనిచ్చేది కాదు. పిడ కలు చేసి అమ్మేది. బొరిగతో చకచకా గడ్డికోసి గంపలకి గంపలెత్తి అమ్మేది. కాని కూతురికి పావుతులం బంగారం కొనలేకపోయింది.

అయితే ఇప్పుడు ఆ కూతురు మెడలోనే పది తులాల బంగారం మెరుస్తోంది. అది తన కష్టంతో కాదు– అదృష్టం వల్ల. తనకి అదృష్టం, రోగం ఒకేసారి వచ్చేయి. అదృష్టం ఆస్తి తెచ్చింది. రోగం వంటికి నీరు నెక్కించింది. సోములమ్మగా ఎవరికీ తెలీనితను దిబ్బమ్మగా ఆ వూళ్ళో ప్రసిద్ధికెక్కింది. తన పెనిమిటి పదిహేనేళ్ళు మిలటరీలో సేవచేసినం దుకు ఐదెకరాల బంజరు పొలం బహూకరించింది .... ప్రభుత్వం. ఎందుకూ పనికిరాని ఆ భూమి పక్కనే ఐదువేల మంది పనిచేసే ఫేక్టరీ లేచింది. దాంతో ఆ భూమికి ఎక్కడలేని గిరాకీ వచ్చింది. ఒక ఉద్యోగి వచ్చాడు. ఆ భూమిని ప్లాటులు వేసి అధిక లాభానికి అమ్మిపెడతానన్నాడు. అందులో నూటికి 10 రూపాయల కమిషన్ ఇమ్మన్నాడు. ఆ వ్యవహా రాలు తెలీక తన పెనిమిటి అందుకు ఒప్పుకున్నాడు. చివరికి ఆ ఉద్యోగి కమిషన్ డబ్బుతోనే ఇల్లు కట్టేయగల్గేడు. వాడు ఏదో మాయ చేశాడని చాలా మంది అంటారు గాని – తనకా లెక్కలు తెలీదు గనక 'అవును, మాయ చేసే వుంటాడు దొంగ సచ్చినోడు' అని అనుకోవడం ఆమె ఇష్టపడదు. డబ్బు తమకీ బాగానేవచ్చి పడింది. కమ్మలిల్లు పెంకుటిల్లుగా మారింది. కూతురికి 5 వేల కట్నంతో, 10 తులాల బంగారంతో పెళ్ళి చేసింది.

దిబ్బమ్మకి ఒకతే కూతురు. నలుగురు పిల్లలు పుట్టిపోయారు. కూతురు పెళ్ళయి, అత్తవారింటికి పోయేక తనూ, పెనిమిటీ ఇద్దరే వుంటు న్నారు. ఇప్పటికీ కూర్చొని తినడం ఆమెకి ఇష్టముండదు. తనకిప్పుడు ఎనిమిది గేదెలున్నాయి. ఆపాలు కంపెనీ క్వార్టర్సులోవున్న ఉద్యోగస్థులకి పోస్తుంది. పాలు పితకడం కానించి, గేదెల్ని, గేదెలుండే పాకని శుభ్రం

చేయడం వగైరా అంతా తనే చూస్తుంది. తనకి పెనిమిటి చేసేది సాయం మాత్రమే.

తను కూలి కెళ్ళిన రోజుల్లో రోజంతా కష్టపడితే రెండు రూపాయలు సంపాదించడం బ్రహ్మాండమై పోయేది. అలాంటిది రిక్షావాడికి ఆ పాటి దూరానికే రెండు రూపాయలు కావాలట! అయినా రోజులు మారి పోయేయి. ధరలు మండి పోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయన్న బాధతోపాటు అసలు బజార్లో పూర్తిగా దొరక్కుండా మాయమైపోతాయేమోనని భయం!

రిక్షా నరిసిగాడు రెండడిగేడు.

దిబ్బ సోములమ్మ రూపాయి ఇస్తానంది.

సెటిలుమెంటు రూపాయిన్నరకయింది.

ఏం చేస్తుంది. అర్ధరూపాయి తగ్గేడు అదే చాలను కుంది. ఏమంటే ఈ రిక్షావాళ్ళతో గొప్ప పేచీ. 'రిక్షా అబ్బాయ్, నీ వడిగిన బేరం నేనివ్వ లేను, తప్పుకో' అంటే తప్పుకోడు. మనకి తోవ ఇవ్వడు. మరో రిక్షా దగ్గరకి వెళ్ళనీయడు. మనల్ని వెంటాడుతాడు. వెంట వాడు వుండగా మరో రిక్షావాడు ముందుకి రాడు. గొప్ప హింస పెట్టేస్తాడు, ఎలాగోలా వాడితో దెబ్బలాటకి దూరంగా వుండి — మరో రిక్షావాడి దగ్గరకెళ్ళి బేర మాడితే ....వాడూ అంతే! అదే రేటు చెబుతాడు. అంతా ఒకే రేటు. ఒకే కట్టు ఎవరైనా కట్టుతప్పి, రేటు తగ్గించడానికి కక్కుర్తి పడ్డాడో — ఇక వాళ్ళలో వాళ్ళు కొట్టుకుంటారు. ఇక ప్రయాణికుడి పని అంతే!

ఈ గొడవలేం పడకుండా నరిసిగాడి రిక్షాయే బేరం సెటిల్ చేసుకుంది. రిక్షా వరకు పెట్టె పట్టుకోడానికి నర్సిగాడి కిష్టలేదు. ఫర్వాలేదు, తనే పట్టుకుంటానంది దిబ్బమ్మ.

తను పరుగెత్తలేదు. వాడు పెట్టె పట్టుకొని పరుగున పారిపోతేనో! అమ్మో ఇంకేమయినా వుందా!

ట్రంకు పెట్టె పైకలా కనిపిస్తోంది గాని.... దాని ఖరీదు పదివేలు!

రిక్షా ఎక్కడమంటే దిబ్బికి చెడ్డ సంతోషంగా వుంది. కాని సిటంతా

మామ్మెత్తి ఆక్రమించేయడంతో పసుపు పక్కన పిలకలా నక్కి,నక్కి పోవడంతో ముఖం చిన్నబోయింది.

* * *

దివ్యమ్మకి రైలు దిగిన కాణ్ణించి దాహంగా వుంది. రిక్షాను ఆపించి ఏ కొట్టు దగ్గరైనా సోడా తాగుదామనుకుంది. కాని కొట్లు మూసేసి వున్నాయి. పోనీ స్టాండు దగ్గర తాగొచ్చు అనుకుంది.

స్టాండుకొస్తే - తీరా అక్కడా లేవు కొట్లు! లేకపోతే లేక పోయాయి వెధవ కొట్లు. సోడా తాగడం మానేస్తాం. కాని బస్సులు కూడా వున్నట్టు లేవే!

స్టాండులో పిట్ట మనిషికూడా లేడు; రెండు కుక్కలు మాత్రం సరదాగా కరుచుకుంటూ, దొర్లుకుంటూ స్టాండును ఆక్రమించేశాయి. జంక్షనులో హార్బరు కెళ్ళే రోడ్డు కిరువైపులా, ఎల్లవేళలా పచ్చపచ్చగా మెరిసిపోతూ జీవనదులు! ఆ నదుల పై నుంచి వీస్తున్న గాలి మాత్రం ముక్కుల్ని మీరు మూసుకోపోతే మీ ఖర్మ అంటోంది.

దివ్యమ్మకి ఎందుకో గాభరా వేసింది. రిక్షా దిగలేదు.

రిక్షావాడు దిగు దిగు అనలేదు.

తెల్లబోయేలా, బెదురు చూపులు చూస్తున్న ఆమె ముఖం చూస్తుంటే నరిసిగాడికి నవ్వొస్తుంది.

వాడికి అంతా తెల్సు. కొట్లు లేక పోవడం ఏటో, బస్సులు రాక పోవడం ఏటో తెల్సు! తెల్సు అంతా తెల్సు వాడికి! ఇక్కణ్ణించి మళ్ళీ తనే కట్టక తప్పదనీ, దానికి మళ్ళీ వేరే బేరమనీ.... పెద్ద ఆశే వుంది వాడికి.

నరిసిగాడు తనకేమీ తెలీనట్టు నడిచిపోతున్న ఒకతణ్ణి ఆపి అడిగేడు — "ఏటి బాబు ఏటయింది? కొట్లూ, బస్సులూ, ఆటోలూ.... ఏటీ లేవేటి? .... ఏటయ్యిందో"

"ఈ రోజు బందయ్యా బంద్' ఇంకేం బస్సులు. ఇంకేం కొట్లు. ఇంకేం హోటల్లు! అధిక ధరలకి నిరసనగా బంద్ అని వారం రోజుల్నించి గోల పెడుతున్నారు గదయ్యా" - అంటూ వెళ్ళి పోయాడు అతడు.

దిబ్బమ్మ గుండెల్లో రాయి పడింది.

"ఇప్పుడేం దారి దేవుడోయ్" అనుకుంది.

ఎందుకనుంచి రిక్షావాళ్ళకి ఓ సహాయింపు వుంది. 'రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. తాగి కొట్టుకోనీయ్ – వాళ్ళనెందుకు ఇబ్బంది పెట్టడం' అని వదిలేస్తారు బంద్ నిర్వాహకులు.

ఇప్పుడా అవకాశం తీసుకుని .... బేరం మరో.... అయిదో, ఆరో కొట్టేయాలని ఆశ పడుతున్నాడు నరిసిగాడు.

అవకాశం వచ్చినప్పుడు ఎవరి వాళ్ళే అందినంత మేరకి దులిపేసుకోడమే (ప్రస్తుతం అమల్లో వున్న) లోక న్యాయం! అందులో లింగ భేదం లేదు. వర్గ భేదం లేదు. 'తప్పు, దోచుకోవడం తప్పు, తప్పు' అని వచ్చే ధాన్నుంచి తప్పుకుంటే – ధనంతులు కట్టడం సంగతికేం గాని, బతకడమే కష్టమై పోతున్న మాయదారి రోజులు!

"ఎక్కడికెళ్ళాలమ్మా?"

"నారయ్యపాలెం బాబూ"

ఏటీ! నారయ్యపాలెవా!.... అయ్యబాబోయ్ అంత దూరమే!.... సరిపోయింది. తను ఏ కోడు కొట్టిర్గాడో. ఏ షిప్‌యార్డో అనుకున్నాడు గాని.... ఎక్కడో ఎ. పి. హెచ్. బి. బి. దగ్గరున్న నారయ్యపాలెమంటే ఎవడు కడ్తాడు.... తగలనా, తగలనా ఎలాంటి బేరం తగిలిందిరా బాబూ – అనుకున్నాడు నరిసిగాడు చిరాగ్గా.

"బాబూ! ఎలాగోలా నువ్వే రిక్షా కట్టి పున్నెం కట్టుకో నాయనా" ప్రాధేయపూర్వకంగా అడిగింది దిబ్బమ్మ.

"నాది బిగ్రోలు కాత్తల్లి, కట్టం.... నానంత దూరం రాలేను తల్లోయ్" అని బుర్ర అడ్డంగా వూపేశాడు.

చుట్టూ చూసింది. చుట్టుపక్కల మరేం రిక్షాలు లేవు! ఈ రోజు రిక్షాల డిమాండు అలావుంది మరి. దావుల మధ్యం కిందనుంచి ఓ పోలీసు వ్యాను వెళ్ళిపోతోంది. నేవెల్ బేసుకి ఏదో జీపు పోతోంది. ఎదురుగా స్మశానంలోంచి శవం కాలుస్తున్న పొగ వస్తోంది. బిచ్చివాడిని ఒక

పక్రాం త్రొక్కైలో లాక్కుపోతున్నాడు. ఏ కష్టిలేని పదేళ్ళబాలుడు-కూలికి!

"అలాగ అనేయకు బాబు. ఎంతకైతే కడతావో అడుగు. అంతే దాని కట్టునేస్తే మేం వచ్చిపోవాం" అంది దిబ్బమ్మ.

నరిసిగాడు తల గోక్కొని ముఖం అదోలా పెట్టి అన్నాడు — "ఇరవై అప్పట్టమ్మా.... ఈ రూపాయిన్నర కాక."

కష్టానికి అదే సంతోషం అనుకొని "మళ్ళా రూపాయిన్నర యిందుకు. మొత్తం ఇరవై చేసుకో బాబూ" అంది.

"అదేం కుదర్దు" అన్నాడు నరిసిగాడు.

"సరే. పోనీయ్ బాబు" అంది దిబ్బమ్మ.

స్టాండుకి రూపాయిన్నర పోయడానికి గిజగిజలాడిన దిబ్బమ్మ మరో ఇరవైకి వెంటనే ఒప్పేసుకుంది. ఒప్పుకోక చస్తుందా!

దిబ్బమ్మ యెంతంటే అంతకి ఒప్పేసుకోడంతో - మరో అయిదు ఎక్కువ అడిగి వుండాల్సింది, అయ్యయ్యో!- అని బాధపడ్డాడు నరిసిగాడు.

ఎండ తీక్షణంగా వుంది. ఇంటికెలా చేరాలనే భయం. కలవరపాటులో తన దాహం సంగతే మర్చిపోయింది.

చావుల మదుం కిందనుంచి చావు డప్పుల గాజాలతో ఊరేగి వస్తోంది ఒక శవం! పాడె వెనకాల పడుతున్న పైసల కోసం నలుగురు బిసమొల కుర్రాళ్ళు పడి కొట్టుకు చస్తున్నారు. స్టాండులో వున్న రెండు కుక్కలు ఆడుతున్న ఆటలు ఆపేసి దీనంగా, భయంకరంగా అరవడం మొదలుపెట్టాయి. దిబ్బమ్మ ఆ కుక్కల అరుపులు భరించలేక ఛీ ఛీ అని కేకలు వేసింది. ఆ కేకలకి కుక్కలు చలించలేదు. రిక్షా కదలడానికి గ్రీన్ సిగ్నల్ యిచ్చినట్టు మదుం మీద నుంచి రైలు కూత పెట్టింది.

రిక్షాకి పాడె ఎదురు రావడం యిష్టంలేదు దిబ్బమ్మకి. గబగబా దాటించేయమంది రిక్షాని.

చిట్టి పెళ్ళి పల్లకీని చూసి ఆనందించినట్టే, ఆ పాడెనుకూడా కన్నార్చి

యస్‌గా, కళ్ళార్పకుండా చూస్తోంది. ఇంటికెలా చేరాలనే భయమే కాదు. ఏ బాధా, భయంలేని వరం లాంటి వయసు ఆ పాపది.

రిక్షా కదులుతుండగా దిబ్బమ్మ మనసులో ఏడుకొండలవాణ్ణి తలుచుకుంది. 'ఇంటికి క్షేమంగా చేర్చు తండ్రీ, ఈ పసిపిల్లతో, ఈ ట్రంకు పెట్టెతో నన్ను ఒడ్డుకి పడేయ్ తండ్రీ' అని ప్రార్థించింది.

* * * *

ధరల పెరుగుదలకి నిరసనగా బంద్ జరుపుతున్నందుకు దిబ్బమ్మ విసుక్కోవడంలేదు. దురదృష్టవశాత్తు బంద్‌కి దొరికిపోయినందుకు తనను తాను నిందించుకుంటోంది. తనలాంటి ఏ ఒక్క వ్యక్తో ఇబ్బందుల పాలవుతారని ప్రజల ఉద్యమాలనే తప్పు పట్టడం తప్పు కాదూ?

జరుగుతున్న బంద్ ధరల పెరుగుదలకే కాదు, క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితికి కూడా నిరసన అని ఆమెకి తెలీదు.

మనిషికి సెక్యూరిటీ అంటూ ఒకటి లేకుండా పోయింది. గుండెమీద చేతులేసుకొని ఎవరూ నిద్రపోలేకపోతున్నారు. నిర్భయంగా, నిశ్చింతగా వుండలేకపోతున్నారు. ఎక్కడ చూసినా అత్యాచారాలు, అలజడులు, దుర్మార్గాలు. ఇంటినుంచి బయటికెళ్ళిన పెనిమిటి తిరిగి ఇంటికి చేరేవరకు ఇల్లాలికి పీకు పీకు భయం! ఇంట్లో వంటరిగా వున్న తన ఇల్లాలిపై ఏ అత్యాచారాలు సాగుతాయో. ఇంటిపై ఏ రాబందులు వాలేయో – అని అవతల భర్త భయం. బతికే బతుకంతా భయం, భయం అయిపోయింది.

వంటరిగా ప్రయాణంచేస్తున్న ఆడమనిషిపై జరిగే అత్యాచారాలకి అంతే లేదు. ఆరేళ్ళ పసిపాపనే కాదు, ఎనభయ్యేళ్ళ ముసలమ్మనే మానభంగాలు చేసేస్తున్నారు. బంగారం కోసం చెవుల్ని, ముక్కుల్ని కూడా నిర్దాక్షిణ్యంగా కోసేస్తున్నారు. ఈ పరిస్థితిలో —

ఏ మగతోడు లేకుండా ఒంటరిగా పదిమైళ్ళ దూరం ప్రయాణం చేస్తోంది దిబ్బమ్మ. NH 5 రోడ్డుకి టర్నయి, కాకానినగర్ దాటేక - నాతయ్యపాలెం చేరేదాకా ఒక్క ఇల్లుగాని, పిట్టమనిషి గాని కనిపించదు. దిబ్బమ్మ చెవులకి పోగులున్నాయి. ముక్కుకి నత్తువుంది. మెళ్ళో

గొలుసు వుంది. చిట్టి చెవులకి రింగులున్నాయి. అంతేకాదు పెట్టెలో బంగారం ఎనిమిది తులాలు వుంది!

అల్లుడు చేస్తున్న ఉద్యోగం మానేసి ఆ బంగారంతో ఏదో వ్యాపారం చేస్తానంటున్నాడు. కూతురుకది ఇష్టంలేక, మొగుడెక్కడ బంగారం లాగేసుకుంటాడోనని (అప్పటికే రెండు తులాలు ఆర్పేశాడు!) తల్లి చేతికిచ్చేసి నీ దగ్గరే వుంచమ్మా అంది. తీసుకు వెళ్ళిపో అమ్మా అంది. తీసుకు వస్తోంది తను! బంగారం మోసుకెళ్ళడం ఇంత ఇబ్బందని అనుకో లేదు. సిటీబస్సే వుంటే ఇబ్బందే అనిపించకపోను!

ఎండ నిప్పులు చెరుగుతోంది. రోడ్డుమీద తారు మెత్తగా కరుగు తోంది. ఎక్కడో ఇళ్ళంటుకున్నట్టున్నాయి—ఫైర్ సర్వీస్ లారీలు గణ గణ గంటల చప్పుడుతో తాపీగా పోతున్నాయి! రోడ్డుకిరువైపులనున్న దుకాణాలు మూసేసి వున్నాయి. మెడికల్‌షాపువాడు నా దుకాణంకేం ఫర్వాలేదు—అని ధైర్యంగా తెరిచే వుంచాడు. ఒకటీ, రెండు చోట్ల కొద్దిగ తలుపులు తెరిచి తొందర, తొందరగా, భయం, భయంగా అమ్మకాలు చేస్తున్నారు. బంద్‌తోపాటు భీకరమైన ఎండ కాస్తుండటంచేత రోడ్డుమీద జనంలేరు. అక్కడక్కడ పోలీసులు లాఠీలు, తుపాకులతో వున్నారు. అయిదు నిమిషాల క్రితమే కర్ఫ్యూ సడలించి 144 సెక్షను పెట్టినట్టు నిస్తేజంగా వుంది రోడ్డు.

దిబ్బమ్మకి బెంగగా, గాబరాగా వుంది. రిక్షా వెళ్తూంటే తోవలో పెదితల్లమ్మ గుడి తగిలింది. నరిసిగాడి చేతిలో పావలా పెట్టి 'బాబూ ఆ యమ్మ హుండీలో వేసిరా బాబూ'అంది. తర్వాత రామ మందిరం తగి లింది. రిక్షాలోంచే దండం పెట్టుకుంది రిక్షా అప్ ఎక్కేక ముత్యాలమ్మ గుడి....తను లెంపలు వాయించుకు దండం పెట్టింది. పక్కనే శివ కోవెల! తనేకాక చిట్టిచేత దండం పెట్టించింది

దండం పెడుతున్న చిట్టికి ఏం జ్ఞాపకం వచ్చిందో ఏమో'మామ్మా! ఆకలి' అంది. ఇదిగో ఇంటికొచ్చేసేం అంటూ మరిపించడానికి మనవ రాలిని మాటల్లోకి దించింది మామ్మ?

చిట్టి ఆపకుండా ఏవేవో పిచ్చి, పిచ్చి ప్రశ్నలు వేసి వేధిస్తోంది.

సాధ్యమైనంతవరకూ చిరాకు పడకుండా పిల్ల యక్షప్రశ్నలకి సమాధానం చెబుతోంది దిబ్బమ్మ.

రిక్షా కీచు కీచు మని వెళ్తోంది. స్పీడు లేదు. నరిసిగాడు హుషారుగా ఫెడలు వేసినప్పటికీ చక్రాలు సర్రున పరుగుదీయడం లేదు. డొక్కు రిక్షా! పోనీ డొక్కుదైనా ఏనాదైనా ఆయిలింగ్ చేసిన పాపానికి పోతేనా!

గట్టిగా ఫెడలు వేస్తున్నప్పుడు చైను ఫట్ ఫట్ మంటోంది. వాటికి దిబ్బమ్మ నెక్కించుకొని రిక్షా తొక్కడం—నడుం మీద వంద కేజీల బియ్యం బస్తాని వేసుకు మోస్తున్నట్టే వుంది.

రోడ్డంతా ఎగుడోటు!

మరిక ఫెడలు వేయడం కష్టమయి 'దీసమ్మ' అని కిందకి దిగేడు. కాళ్ళు చుర్రు మంటున్నాయి. తారు చురకలు పెడుతోంది. ఎడమచేయి హాండిలు మీద వేసి, కుడిచేయి వెనుక ఐరన్ స్టాండుమీద వేసి బలంగా లాగుతున్నాడు. తన శక్తినంతా కూడదీసి వంగొని లాగుతుంటే తనకి ముందు చక్రం మూడు చక్రాల్లా కనిపిస్తోంది. కళ్ళమీద చెమటపడి మసక కమ్మేస్తోంది. మోచేతి బనీనుకి ముఖం తుడుచుకుంటూ రిక్షాని ముందుకి పోనిస్తున్నాడు. నుదిటిపై చెమటబొట్లు రోడ్డుపైపడి, అంతలో ఆవిరై పోతున్నాయి.

రిక్షాకి అడ్డంగా గజ్జికుక్క వచ్చింది. 'ఛత్తరి....నీయమ్మ' అని దాన్నొక్కతాపు తన్నేడు. అది కుయ్ కుయ్ మని పరిగెట్టింది. రిక్షాని అంత కష్టంగా లాగుతున్నప్పుడు నరిసిగాడి కెంతో కసిగా, కచ్చగా వుంటుంది. ఆ కసి, కచ్చ ఎవరి మీదో తెలీదు. ఆ సమయంలో కుక్కైనా లారీ. రిక్షా, మనిషి....ఏ అడ్డొచ్చినా, ఎవరు అడ్డొచ్చినా ఎగిరిపోయి బూతులు అందుకుంటాడు.

గంటసేపు తొక్కితే—ఇంకా సగం దూరమైనా రాలేదు!'ఛత్తిరి! ....ఇరవై రూపాయలకి కక్కుర్తిపడిపోయి తొక్కలేని దూరానికి ఒప్పు కున్నాను. అంతా ఎగుడోటు. ఎదురుగాలి, మిట్ట మధ్యాహ్నం. కూర్చు న్నది దిబ్బది! రిక్షా డొక్కుది!....ఏదైనా రిక్షాకి తన బేరం అప్ప గించేసి తప్పుకుంటే బాగుణ్ణు అనిపిస్తోంది. అడివిలోంచి ఎడారిలోకెళ్ళ

దానికి తను కాబట్టి ఒప్పేసుకున్నాడు గాని బుద్ధి, బుర్రావున్న ఏ రిక్షా వా కొడుకూ కట్టడు, కట్టడు—అనుకున్నాడు నరిసిగాడు.

తెల్లారి కొట్టిన గెడ్డెన్నడు చద్దన్నం ఏమూల కెళ్ళిపోయిందో.... లోన పేగులన్నీ ఎలుకలు కొరికేస్తున్నాయి.

చిట్టెమ్మకి చెమటలో తడిసిన వాడి కండలు యునెస బొమ్మలా కనిపిస్తున్నాయి. చేతులపై నరాలు ఎత్తుగా ఉబ్బేయి. పొట్టి నిక్కరు లోంచి తొడలు, పిక్కలు రాళ్ళలా కనిపిస్తున్నాయి. గోడకి పోస్టరు అంటించినట్టు బనీను వీపుకి అతుక్కుపోయింది. బనీను మీద కన్నాలు అయిదు లెక్కపెట్టింది చిట్టి.

చిన్న కొండలా వున్న కొత్తరోడ్డు బ్రిడ్జ్ దాటేటప్పటికి పన్నెండు సైరను ఊదింది. రిక్షా సింహాచలం రోడ్డుదాటి NH 5 రోడ్డులో వుంది ఇపుడు. బ్రిడ్జ్ కింద వంకర వంకరగా తిరిగివున్న పట్టాలు—పాదరసం మెరుగుతిన్న గొట్టాల్లా ఉన్నాయి. తాగేసో, లేక మూర్ఛపోయో ఒకడు పక్కన పడివున్నాడు. ఆ బ్రిడ్జ్ దగ్గర అర్బన్ ఏరియా దాటి రూరల్ ఏరియాలోకి వెళ్ళిపోతున్నవాంకి మున్సిపాలిటీ 'థాంక్యూ' అని బోర్డు కట్టి చెబుతోంది!

రిక్షా బ్రిడ్జి నెక్కడం ఎంత కష్టమయిందో, దిగడం అంత ఈజీగా వుంది, కాని ఎదురుగాలి అటకాయిస్తూనే వుంది.

ఇక ఎదురుగా ఎడారి. రోడ్డుపక్కన ఒకయిల్లు లేకపోతేపోనీ, నీడనిచ్చే ఒక చెట్టు కూడా లేదు. అంతా డ్రయ్ ఏరియా. ఈ ఎడారిలో గంట సేపు ఈదుకెళ్తేగాని నాతయ్యపాలెం అంచులు దొరకవు.

చిట్టి సీటులో ఒద్దికగా కూచోకుండా నించోని, పెద్దతొక్కి. అటు కదిలి, ఇటుకదిలి, స్టాండు పట్టుకు వూగి ఎంత అల్లరి చేసినా భరించింది చిట్టెమ్మ. అడిగిన లక్షయక్ష ప్రశ్నలకీ జవాబులు ఇచ్చింది. చిట్టిది ఒక్కందేటు—దాహం. ఆకలి అనడంలేదు. అదే చాలు అనుకుంటోంది. నెమ్మదిగా ఇంటికాకా ఓపిక పడితే ఏదైనా గబగబా వండి పెట్టెయ్యొచ్చు.

కాని అనుకున్నట్టు జరగలేదు.

ఆకస్మాత్తుగా ఆకలేస్తోందని రాగం తీయడం మొదలుపెట్టింది చిట్టి.

ఎంత నచ్చజెప్పినా, ఎన్ని మాయమాటలు ఆడినా వినిపించుకోలేదు. పోనీ ఏదైనా కొని ఇద్దామన్నా గడ్డితప్ప ఎక్కడా ఏమీలేదు.

అయిదు నిమిషాలు నచ్చజెప్పచూసి, విసిగి వీపుమీద రెండు బాదులు బాదింది. నెత్తిమీద రెండు మొట్టికాయలు మొట్టింది.

చిట్టి గొప్ప మాటకారి. చిట్టిచేత ఏవేవో మాట్లాడించుకుని, వినడం. మురిసిపోవడం దిబ్బమ్మకి ఇష్టం. స్కూలు సెలవులివ్వడంతో చిట్టిని వెంటేసుకుని వచ్చింది.

ఎప్పుడూ కొట్టని మామ్మ కొట్టడంతో చిట్టికి కోపం, రోషం వచ్చింది.

"నీ జుట్టు పీస్....నీవు నా కొద్దు. మా అమ్మకాడికెళ్ళిపోతాను" అంది.

"ఎళ్ళిపోవే సిగురుగుంట! ....ఒవుల్నే బెదిరిస్తావు"

"అవుతే నన్ను దిగబెట్టేయి మా ఇంటికి"

"ఆఁ ! నాకు పట్టింది బాధ" అంది ఒళ్ళు మండి. అంత మంటలోనూ మనవరాలితో వాదన సరదాగా వున్నట్టుంది దిబ్బమ్మకి.

"నాకేం బయ్యవేఁటి? నేనెళ్ళిపోగల్ను"

"పో అయితే"

"డబ్బులియ్యి"

"తొంగుడున్నాయి!"

డబ్బులు తొంగుడోడమేపిఁటో చిట్టికి అర్థం కాలేదు. మొత్తానికి డబ్బులివ్వనంటుందని అర్థమయ్యింది.

"అవుతే, మా నగలిచ్చేసేయ్."

"ఏం నగలు? మీ బాబు సంపాయించేడా? మీ యమ్మ సంపాయించిందా!"

"అదేం కాదు.... మా అమ్మవి, ఇచ్చేయ్"- రోషంగా మామ్మ గుండెల మీద గుద్దుతూ అంది.

మనవరాలితో అలా గుండెల మీద గుద్దించుకోవడం సరదాగానే వున్నట్టుంది దిబ్బమ్మకి.

"ఇస్తావా, లేదా?"

"తిర్నాళ్ళవుతున్నాయి లచ్చోరం సంతలో"

సంతలో తర్నాళ్ళద్దం ఏమిటో అర్థం కాక— "అదేం కాదు. నాకు తెల్సు. ఇగో ఈ పెట్టెలో వున్నాయి మా అమ్మ నగలు" తెలియజేసింది గొప్పగా.

ఆ దెబ్బతో దిబ్బమ్మకి మురిసిపోతున్న మనవరాలి ముచ్చటా, నిచ్చటా ఎగిరిపోయేయి. ఆమె గుండెలు ఒక నిమిషంపాటు కొట్టు కోవడం మర్చిపోయేయి. రిక్షావాడు వినేశాడు.... వినేశాడు. అవును వినే శాడు. అమ్మనాయినో ఇంకేం వుంది. అదిగో రిక్షా ఆపేశాడు.... ఎంత పని చేశావే గుంటా? ఇంకేం వుంది.... అయిపోయింది, అంతా అయి పోయింది, దేవుడోయ్.... అయిపోయింది .... పెట్టెలంకించుకు పోతాడు. ఇక నేనేం చేతును దేవుడోయ్....

చిట్టిని ఉగ్రంగా రెండు చేతుల్తో దబదబా మొత్తేసింది. 'చావే గుంటా, చావు' అని జుత్తు పీకేసింది.

నరిసిగాడు రిక్షాని ఆపేడు.

రోడ్డుకి ఎడమవైపున పచ్చపచ్చగా మెరిసిపోతూ పొలాలు. ఆ పచ్చని పొలం పక్కనే గాలివాన తుప్పలు, తుమ్మచెట్లుతో నిండిపోయిన బీడునేల. కాళ్ళూ, చేతులూ, ముక్కూ, ముఖం చెక్కేసినట్టున్న తవ్వి సంత తవ్వి వదిలేసిన మొండి కొండ! విశాలంగాలేని చిన్ని ఏరోడ్రాంలో పెద్ద పక్షి ఏదో వాలినట్టు విశ్రాంతి తీసుకుంటున్న విమానం! రోడ్డు కిరు వైపులా - కాస్త దూరంలో దట్టంగా పెరిగిన సరివిడి తోట. ఆకాశం అంచుల్ని వంకరటింకరగా కత్తిరించినట్లు చుట్టూ కొండలు, కొండలు! సింహాచలం కొండ వెండిజరీ తలపాగ చుట్టుకున్నట్టు శిఖరాన్ని చుంబిస్తూ తెల్ల మబ్బులు! చెట్లు, తుప్పలు. రాళ్ళ గుట్టల మధ్య నుంచి కొండచిలు వలా పాకుతూ రైలు.... చిట్టి అంత ఏడుపులోనూ రైలుని దీక్షగా కళ్ళా ర్పకుండా చూస్తోంది.

"ఎందుకు తల్లీ పిల్లనలా బాదేస్తావు."అన్నాడు నరిసిగాడు. అంటూ దగ్గర కొచ్చాడు. ఒక చేయి పెట్టెమీద వేశాడు.

"అమ్మా. కొద్దిగ లేస్తారా"

తనని దింపేసి రిక్షాలో పిల్లనీ, పెట్టెనీ పట్టుకు ఉడాయిం చేస్తాడా?

చిట్టిని ట్రంకు పెట్టెమీద గించోబెట్టేడు.

"మిమ్మల్నేనమ్మా.... కొదిగ లెగండి"

దిగకపోతే తోసేస్తాడేమో!

దిబ్బమ్మ గుండె దబదబ కొట్టుకుంటోంది. కాళ్ళు తడబడుతున్నాయి. నెమ్మదిగా రిక్షా దిగింది. నరిసిగాడు సీటుని పక్కకి తప్పించేడు. బల్ల చెక్కను తీసేడు. చిన్న అరలా వుంది. అందులో మాసిన గుడ్డపీలికలు, స్పైను కర్రెస్లు వున్నాయి. చేత్తో లోపల దేవుతున్నాడు.

కత్తిగాని తీస్తాడా!.... వణికిపోతోంది. దిబ్బమ్మ

చివరికి దొరికింది చేతికి! పచ్చగా జామికాయ!

జామికాయ చిట్టి చేతిలో పెట్టి, బల్లచెక్కను సర్ది, సీటువేసి, దానిపై ఒక చరుపు చరిసి.... 'కూర్చోండమ్మా' అన్నాడు దిబ్బమ్మని.

దిబ్బమ్మ నిట్టూర్చి, గుండెల మించి చేతులు తీసేసింది. రిక్షా ఎక్కింది.

చిట్టి ఏడుపు ఆపింది.

రిక్షా కదిలింది.

రిక్షావాడు ఇచ్చిన జాంకాయ దగ్గర అంత బంగారం తీసుకట్టుగా, విలువ లేనిదిగా అనిపించింది దిబ్బమ్మకి.

* * *

ఎదురు గాలికి రిక్షా కదలడంలేదు. అయిదు నిముషాలకి రిక్షా పది గజాల దూరమెళ్ళడం గగనమవుతోంది. గాలి బొయ్ బొయ్ మని రాక్షస చప్పుడు చేస్తోంది. రిక్షా టాపు టప్‌టప్ మని కొట్టుకుంటోంది. ఎదురుగా ఒకడు సైకిల్ తొక్కకుండా, ఫెడలు వేయకుండా, హాండిల్ మీద చేతులు వదిలేసి మరీ పోజుగా వస్తున్నాడు!

మేఘాలు చెదిరి పీలికలై ఎగిరిపోతున్నాయి. సూర్యుడూ, గాలీ పోటీపడి ఎవరి ప్రతాపం వాళ్ళు చూపిస్తున్నట్టు.... తీవ్రంగా ఎండ వేడి, వేడి గాడ్పులు కొడుతూ ఎదురుగాలి. ఒక్కొక్కసారి ఆ గాలికి రిక్షా

పెట్టుకోలేక ఒక మిల్లీమీటరైనా ముందుకెళ్ళడం కాదు-వెనక్కి వెళ్ళిపో తోంది. [illegible] కొడ్తున్న చెంపదెబ్బలకి సరివిడి చెట్లు గిజగిజలాడి పోతున్నాయి.

నరిసిగాడికి కొండ ఎక్కుతున్నట్టుగా వుంది. ఎక్కలేకపోతు న్నా కొండ. ఎక్కాలి, అదిగో కనిపిస్తోంది శిఖరం.... అందుకోవాలి!- [illegible]తో యుద్ధం చేస్తున్నాడు నరిసిగాడు.

మధ్యలో విశ్రాంతి తీసుకోడానికి చెట్టునీడ ఒకదగ్గర కాపోతే ఒక దగ్గరైనాలేదు. నాలిక పిడచ కట్టుకు పోతోంది. కాళ్ళూ, చేతులూ లాగే స్తున్నాయి. తేలిపోతున్నాయి. కళ్ళు తిరిగి పోతున్నాయి. శ్వాస తీయ డానికి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు.

'ఇక రిక్షా నడపలేను తల్లీ.... ఎలాగెల్లావో ఎల్లెమ్మ.... ఇక నా తరం కాదు, ఏ డబ్బులూ వద్దుగాని తల్లీ, ఇకనే తొక్కలేనమ్మ' అని అనేయాలనిపిస్తోంది.

రిక్షా ఆపేశాడు. రిక్షా వెనక్కి వెళ్ళిపోతోంది! రాయి తీసి వెనక చక్రానికి అడ్డంగా పెట్టేడు.

రిక్షా వదిలేసి రోడ్డు దిగిపోతున్న రిక్షావాడికేసి గాభరాగా చూసింది దిబ్బమ్మ.

నరిసిగాడు తాగిన వాడిలా ఊగుతూ మడుంకేసి నడిచేడు

మూత్ర విసర్జనకా! దిబ్బమ్మకి అటువైపు చూడాలో, చూడ కూడదో తెలియకుంటోంది.

మడుం కింద నుంచి గెడ్డ పారుతోంది. నీళ్ళు తేటగా వున్నాయి. కింద తెల్లటి ఇసుక స్పష్టంగా కనిపిస్తోంది. తళుకులీనుతోంది.

నరిసిగాడిని చూసి భయపడి రెండు కప్పలు నీటిలోకి గంతేశాయి.

ఆదమరచి నిద్రపోతున్న తల్లి వక్షం మీదకి .... ఆకలేయగానే గబగబా బంగురుకుంటూ వచ్చి అమాంతంగా పడిపోయి పాలుకుడిచే పసి పాపలా - నరిసిగాడు, అతి నెమ్మదిగా పారుతున్న ఆ నీటిలో అడ్డంగా పడిపోయేడు. నిక్కరు తడవకుండా, బొడ్డు వరకు మాత్రమే నీరు తగిలేలా పడిపోయేడు. చేతులతో నీరుతీసి ముఖానికి దబదబా కొట్టు

కున్నాడు. దోసిళ్ళోకి పట్టుకు నీళ్ళు తాగేడు. తర్వాత చేతులతో కాకుండా ఏకంగా నీటిలో నోరుపెట్టే తాగేడు చెమటకి పూర్తిగా తడిసిన తువ్వాలుని నీటిలోముంచి కాళ్ళు, చేతులు తుడుచుకున్నాడు. బనీనుతీసి పిండుకొని మళ్ళీ వేసేసుకున్నాడు. కొంత ప్రాణం లేచి వచ్చింది.

పక్కనేవున్న పొదల్లోకి వెళ్ళి పెద్ద ఆకులు తెచ్చేడు. ఆ రెండు ఆకులని కోన ఆకారంలో చుట్టి నీళ్ళు పట్టుకొచ్చి దిబ్బమ్మకిచ్చేడు. నీళ్ళు ఆమె రెండు గుక్కలు తాగి మిగతాది ముఖంమీద చిమ్మరించుకుంది. చిట్టి అప్పటికే మామ్మ ఒడిలో నిద్రపోతోంది ; లేకుంటే చిట్టిని తీసుకెళ్ళి నీళ్ళు తాగిద్దామనుకున్నాడు.

ఆగిపోయిన స్కూటరు, రిజర్వులోవున్న పెట్రోలుతో ముందుకు కదిలినట్టు – రిక్షా కదిలింది. మలుపు దాటేక రోడ్డు ఎడమకి తిరగడంతో ఎదురుగాలి దురుసుతనం తగ్గింది. సరివిడి చెట్లు ఎండలో ఆడుతున్న అల్లరిపిల్లల్లా గోలచేస్తున్నాయి. పచ్చని చేను పరగబడి అటూ, ఇటూ వూగుతోంది. తాటిచెట్టుపై నుంచి కిందకి మట్ట పడింది. మట్ట చప్పుడికి ఉడుత జడిసి తుర్రుమంది. రాయిమీద నిలబడిన తొండ వస్తూన్న రిక్షాని నిక్కినిక్కి చూస్తోంది.

రిక్షాకి ఎదురుగా..కాస్త దూరంలో కొండమీదున్న గుడి అందంగా కనిపిస్తోంది.

గుడికన్నా ముందే నాతయ్యపాలెం తగులుతుంది.

'వూరు, అదిగో వచ్చేసింది, వచ్చేసింది' అన్నదే వూపిరై రిక్షా ముందుకు పోతోంది.

* * * *

నాతయ్యపాలెం రిక్షాని చిరునవ్వుతో ఆహ్వానించింది.

'నీయమ్మ, రెండు గంటలపాటు నన్ను సంపినావుగదే' అనుకున్నాడు నరిసిగాడు, వూరి ఆహ్వానాన్ని మన్నిస్తూ ; ఇంచుమించు ఒకే దగ్గరవున్న మూడు బ్రాందీ కొట్లని చూసి వూరు బాగానే వుందే అనుకున్నాడు.

ఎక్కడినుంచో మంచి పాతపాటని తెరలు తెరలుగా మోసు కొస్తోంది గాలి.

రోడ్డుకి కుడివైపునున్న రెండిళ్ళ అవతల ఇల్లే దిబ్బమ్మ యిల్లు. తిన్నగా ఇంటిదగ్గరే ఆగింది రిక్షా.

తన వూరునీ, వూళ్ళో తన ఇల్లునీ చూడగానే దిబ్బమ్మకి కన్న తల్లిని కావలించుకున్నంత ఆనందమైపోయింది. గోదావరి పొంగి పొరలి వూరుని ముంచేస్తుంటే....తనని రక్షించి, పడవ ఎక్కించి ఒడ్డుకి దింపిన తమ్ముడిలా కన్పించాడు నరిసిగాడు.

దిబ్బమ్మ చిట్టిని ఎత్తుకొని దిగింది.

రిక్షా నరిసిగాడు పెట్టెని పట్టుకున్నాడు.

'అమ్మో!' అనుకొని నవ్వుకుంది! పాడుమనిషిని! ఏ పాపం ఎరుగని రిక్షావాణ్ణి యేవేవో అనుమానాలతో వూహించుకొని భయపడి నందుకు సిగ్గుపడింది-కాని ఆ పరిస్థితిలో భయం సహజం అన్నది ఆమె గుర్తించడంలేదు.

దిబ్బమ్మని చూడగానే దిబ్బమ్మ మొగుడి ముఖం దిబ్బరొట్టంతయి పోయి నోరు తెరిచాడు. పాకలో కూర్చొని కునుకుపాట్లు పడుతున్న గేదెలు లేచి సంతోషంతో చెవులు వూపేయి. వరండాలో నులకమంచం వేసి దుప్పటి పరిచేడు దిబ్బమ్మ మొగుడు. పడుకున్న చిట్టిని మంచంమీద వేసింది దిబ్బమ్మ.

నరిసిగాడు పెట్టెని వరండాలో వారగా, గోడపక్కన పెట్టి బయట కొచ్చి నిలుచున్నాడు. తువ్వాలు తీసుకొని ముఖం, చేతులు తుడుచుకుంటు న్నాడు.

చెంబుడు నీళ్ళు తెచ్చి తాగమని ఇచ్చింది దిబ్బమ్మ. చెంబు ఎత్తిపెట్టి గుటుక్, గుటుక్ మని నీళ్ళన్నీ తాగేశాడు. 'ఇంకా కావాలా' అనడిగింది. చాలన్నాడు. "ఇక వెళ్తానమ్మా" అన్నాడు.

"వెళ్దువుగానిలేవాయ్, చూస్తే....నీరసంతో ఎక్కడో పడేపోయే టట్టున్నావు. అందాక ఆ అరుగుమీద నడుంవాల్చు" అంది దిబ్బమ్మ.

అవును, తను వెళ్ళే స్థితిలోలేడు, కాసేపు నడుం వాల్చాలనే వుంది.... ఆ అరుగుమీదకి వెళ్ళేడు.

దిబ్బమ్మ గేదెలు దగ్గరకెళ్ళి ఒకసారి వాటిని పలకరించి చేతుల్తో నిమిరి వంటగదిలోకి వచ్చింది. రెండు పొయ్యిలు వెలిగించి గబగబా ఒక గంటలో వంట చేసేసింది.

వంట చేసేసి, మగత నిద్రలోకి జారిపోయిన నరిసిగాణ్ణి లేపింది. వాడు తుళ్ళిపడి లేచాడు. ఒళ్ళంతా పచ్చి నొప్పిగా వుంది. 'ఆఁ' అని చప్పుడు చేస్తూ ఆవలించాడు. బద్ధకంగా చేతులు విరిచాడు. కళ్ళు నులుముకున్నాడు.

చేతులూ, ముఖం కడుక్కోమని నీళ్ళిచ్చింది. నరిసిగాడికి ఏదో కలలో వున్నట్టే వుంది. కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చేడు. ఎదురుగా విస్తరిలో భోజనం! దిబ్బమ్మ మొగుడు మగ్గుతో సారా అందించేడు! ఇంకేముంది!

అడిగి, అడిగి ఆప్యాయంగా వడ్డిస్తున్న దిబ్బమ్మ ముఖంలోకి ఎందుకో నరిసిగాడు చూడలేకపోయేడు. కళ్ళనీళ్ళు తిరిగేయి. గతం గుర్తుకొచ్చింది.

తను ఏ తండ్రికి పుట్టాడో తెలీదు. తల్లి జబ్బుతో పోవడం గుర్తుంది. గున్నయ్య కాఫీ హోటల్లో కప్పులు కడిగి, పప్పులు రుబ్బి పదేళ్ళు చాకిరీచేసి వాడిదగ్గర డబ్బు దాచుకుంటే - నీవు నా దగ్గర అసలు డబ్బేం దాయలేదు, ఫో పొమ్మన్నాడు. తను పెళ్ళి చేసుకున్న లచ్చి ముగ్గురు పిల్లల్ని కన్న తర్వాత, కొవ్వెక్కి ఎవడితోనో లేచి పోయింది! తనకన్నీ ఇలాంటి దెబ్బలే. మనిషి మంచితనంమీద నమ్మకమెప్పుడో పోయింది. ఇక ప్రేమా, దయా, అనురాగం, ఆప్యాయతా.... ఇవంటే ఏవిటో, ఎలా వుంటాయో తెలీదు. కాని యిప్పుడు....ఈ అనుభవం కొత్తగా వుంది.

"తినుబాబు"

"తింటానుతల్లీ, తింటాను"—కళ్ళు తుడుచుకొని తినడం మొదలెట్టాడు.

విస్తరిలో ఒక్క మెతుకు కూడా మిగల్చకుండా వూడ్చుకు తినేశాడు. వేళ్ళకి అంటుకున్న అన్నాన్ని నాలుకతో నాకేశాడు! చెంబుడు నీళ్లు తాగి తృప్తిగా త్రేన్చేడు.

విస్తరం మీద తువ్వాలుతో చేతులు తుడుచుకొని .... చేతులెత్తి దండం పెట్టి "వస్తాను తల్లీ" అన్నాడు.

విప్పమ్మ నవ్వింది — "అదేంటిబాబూ! 20 రూపాయలొద్దా! అన్నట్టు ఇవవయ్యేం? రూపాయిన్నరొకటివ్వాలికదా"

"చెప్పకేంవుంది, తల్లీ దయతో కడుపునిండా అన్నం పెట్టారు. అదే చాలు. ఆ సల్లదనం ముందర 20 రూపాయలు కాదు తల్లి లచ్చ రూపాయలు కూడా నిలబడ్వేవు తల్లీ" అన్నాడు.

తను ఎన్నాళ్ళగానో రిక్షా తొక్కుతున్నాడు. రిక్షా ఎక్కినోళ్ళంతా మనుషులేనని మొదట్లో అనుకున్నాడు. కాని రిక్షా ఎక్కిన వాళ్ళెవరూ తనని మనిషికింద లెక్కచేయకపోవటంతో, సాటి మనిషిగా చూడకపోవటంతో — 'అవును ఎందుకు చూడాల? చూడాల్సిన అవసరమేటి అలాగే నానెందుకు చూడాల? నాకేటి అవసరం? వాడిది నాద ఆకలి వాడిది బతుకు ఆటది! అనుకున్నాడు. — అయితే

ఆ సరిగాడే ఇపుడు — 'దయా దాచ్చిన్నం ఇంకా బతికే వున్నాయి. పరుడి కడుపు బాధ ఎరిగిన అమ్మలు ఇంకా యీ భూమ్మీద వున్నారు' అనుకున్నాడు. అదే ఆమెతో అన్నాడు. అలా అనేటప్పుడు సరిగాడి కళ్ళు ఆనందం వల్లో, కృతజ్ఞత వల్లో తడితడిగా అయ్యేయి.

'పిచ్చోడా! నాదేదో దయ, నాదేదో మంచి మనసు అంటావు గాని నీ మంచితనమేంటో, నీ గొప్పతనమేంటో నీకు తెల్దు. ఈ ఎడారిలో, ఎండలో, ఎండు గాలిలో.... రెండు గంటలపాటు నువ్వు నీ కష్టంకాద, అమ్మకి పిల్లనిచ్చిన జాగారంకాద, అమ్మకి ఆకు దోనె నిండా నీవిచ్చిన నీళ్ళు కాద.... నా దయేపాటి? నా దాచ్చిన్నమేంపాటి? నువ్వు చేసిన మేలుకి ఏంతలో కొంతైనా ఋణం తీర్చుకుందామని వాన్నం పెట్టినాను గాని అసలు దానికే ఋణం చెల్లిపోదు!.... అయినా చేసిన మేలుకి వాన్నం పెట్టడం గొప్ప కాదయ్యా!.... మేలు చెయ్యడమే గొప్ప!

అంతేకాదు, మంచి సిరాకు. కష్టమైతే ఏమ్యాల. నానేటి? దొరైన సరే... ఆ దేవుడైన సరే.... కష్టం చేసినోడి కాళ్ళకి తలొంచి దండం పెట్టాల, అనుకుంది దిబ్బమ్మ.

దిబ్బమ్మ అలా అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఏమంటే — కష్టం చేసినోళ్ళకే కష్టమంటే ఏమిటో తెలుస్తుంది. కష్టం చేసినోళ్ళకే కనికరమంటే ఏమిటో తెలుస్తుంది. కరిగినా, మరిగినా కష్టజీవోళ్ళ గుండెలో కదులుతుంది, మెదులుతుంది.... దిబ్బమ్మ కష్టం చేసిన మనిషి.

దిబ్బమ్మ చిక్కంలోంచి డబ్బుతీసి యిచ్చింది.

రూపాయిన్నర ప్లస్ యిరవై యివ్వక తప్పదని డిమాండు చేసిన నరిసిగాడు ఆ డబ్బు తీసుకుంటూ.... ఎందుకో సిగ్గుపడ్డాడు. ఇరవయ్యే తీసుకొని రూపాయిన్నర జోలికి వెళ్ళగూడదనుకున్నాడు!

కాని దిబ్బమ్మ నరిసిగాడికిచ్చింది యిరవయ్యో కాదు, యిరవై మీద ఒకటిన్నరా కాదు!

పాతిక!

అవును, పాతిక!

స్టేషన్లో అర్ధరూపాయి కోసం అరగంట బేరమాడిన దిబ్బమ్మ. 'ఒరే! ఏం ఆశరా!' అన్న దిబ్బమ్మ. 'రూపాయిన్నర అడుక్కుంటా మొత్తం ఏకంగా యిరవై చేసుకో' అన్న దిబ్బమ్మ.... వాడు ఏ డిమాండు చేయకుండానే పాతిక రూపాయలిచ్చింది! తను యిచ్చినది వాడి కష్టానికి కట్టిన విలువని కాదు – తనకి తోచినద్ది. తన సంతోషం కొద్దీ ఇచ్చినది.